క్లుప్తంగా

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



కేర్ ఆస్పత్రిలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీ కేర్ ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కేర్ బాలవికాస్ పేరుతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నగరంలో పలు పాఠశాలలకు చెందిన 458 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి ఆస్పత్రి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న అందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిపాలనాధికారి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్లో వైద్యుల పట్ల గౌరవ భావం కలగడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ హరి, న్యాయ నిర్ణేతలు ఏబీఏ కాలేజీ విశ్రాంతి అధ్యాపకురాలు కృష్ణవేణి, డ్రాయింగ్ టీచర్ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మానసిక ఆస్పత్రి వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద ఆస్పత్రిగా మానసిక వ్యాధి నివారణకు అందిస్తున్న సేవలను శ్లాఘించారు. అందరి సహకారంతో ఈ ఆస్పత్రి మరింత విస్తృత స్థాయిలో సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రోగికి సాంత్వన చేకూర్చేలా సేవలు సాగాలన్నారు. అలాగే వైద్యుల దినోత్సవాన్ని కూడా నిర్వహించారు.

నేటి నుంచి సబ్సిడీపై టమాటా విక్రయాలు



స్టాల్‌లో టమాటాలు

ఆరిలోవ: టమాటా ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణ, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలపై భారం తగ్గించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో సబ్సిడీపై టమాటాలు విక్రయించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం కిలో రూ.80 ధర ఉన్న టమాటాలను ఎంవీపీ రైతుబజార్‌లో ఆదివారం నుంచి సబ్సిడీపై కిలో రూ.50కు విక్రయించనున్నారు. ప్రతి వినియోగదారుడికి ఒక కిలో చొప్పున ఇవ్వనున్నట్టు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు. వినియోగదారుడు కౌంటర్‌లో ఆధార్ కార్డు చూపించాలన్నారు.

లలితా పీఠంలో చాతుర్మాస దీక్ష

సీతంపేట: కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఈ నెల 3వ తేదీ ఆషాఢ గురుపౌర్ణమి రోజు నుంచి సెప్టెంబర్ 29 భాద్రపద పౌర్ణమి వరకు చాతుర్మాస దీక్ష చేయనున్నారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ధర్మ రక్షణ, లోక కల్యాణార్థం లలితా పీఠంలో జరిగే ప్రత్యేక యజ్ఞాలు, పూజలు, వేదపారాయణాల్లో స్వామీజీ పాల్గొని లలితాదేవి అమ్మవారి అనుగ్రహం పొందుతారన్నారు.

గురువందన సమర్పణ..

గురు పూర్ణిమ సందర్భంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి లలితా పీఠంలో గురువందన సమర్పణ జరుగుతుందని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు



పిఠాపురం కాలనీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని



28వ వార్డులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

- పిఠాపురం కాలనీలో తొలి శిబిరం
- కలెక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా ప్రారంభం
- తొలిరోజు 238 మందికి పలు ధ్రువ పత్రాల పంపిణీ

మద్దిలపాలెం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను త్వరితగతిన ఇంటి వద్దనే పరిష్కరించాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధి జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురం కాలనీలో తొలి సురక్ష శిబిరాన్ని శనివారం కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలందించాలన్నదే లక్ష్యంగా సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాలలో 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. అక్కరమాని మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. 22వ వార్డులో 238 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, జీవీఎంసీ జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ 28వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి ఉచితంగా ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సులభంగా కుల ధ్రువీకరణ పత్రం పొందాం



పిల్లలకు స్కూల్‌లో చేర్పించడానికి కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఎంతో సులభంగా పొందాం. ఈ పత్రాల కోసం ఎక్కడెక్కడికి తిరగాలో అని ఆలోచిస్తున్న తరుణంలో జగనన్న సురక్ష శిబిరం పుణ్యమా అని మా ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. రెండు రోజుల్లో ధ్రువీకరణ పత్రాలు అందించారు.

– పల్లా శివకుమారి, మంగాపురం కాలనీ

'జగనన్న సురక్ష' ఎంతో మేలు చేసింది



జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో మేలు చేసింది. కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్‌లో మార్పులు చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి మా సమస్య తెలుసుకుని దరఖాస్తు తీసుకున్నారు. ఇప్పుడు ఏకంగా సర్టిఫికెట్లు కూడా ఇచ్చారు.

– కోన పైడమ్మ, రాజీవ్‌నగర్

పిల్లల జనన ధ్రువ పత్రాలు ఇట్టే ఇచ్చేశారు..



పిల్లల జనన ధ్రువ పత్రాలు అవసరం వచ్చింది. కుల, ఆదాయ ధ్రువ పత్రాలు కూడా కావాలి. వాటి కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగన్న సురక్ష పుణ్యమా అని ఇప్పుడు ఆ పత్రాలన్నీ ఎక్కడికి వెళ్లకుండా ఇంటి వద్దే క్షణాల్లో ఇచ్చేశారు.

– కొండాడ శంకరరావు, శివాజీపాలెం

తెల్లవారగానే తలుపుతట్టి.. పెన్షన్ పంపిణీ



దివ్యాంగులకు పెన్షన్ పంపిణీ

ఏయూ క్యాంపస్: తెల్లవారగానే తలుపుతట్టారు. అవ్వా తాతలకు పెన్షన్ పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ పంపిణీ కార్యక్రమం క్రమం తప్పకుండా నెల ఆరంభంలో ఒకటో తేదీన నిర్వహించారు. ఉదయం నుంచి స్థానిక 20వ వార్డులో వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, కిడ్నీ బాధితుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ డబ్బులు అందించేలా చేయడంతో లబ్ధిదారులు అమితమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు.





20వ వార్డులో వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు

కొండవాలుకు రూ.1.15 కోట్లతో యూజీడీ వ్యవస్థ



యూజీడీ పనులకు పెదగదిలి వద్ద శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం కొండవాలుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పనులు రూ.1.15 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో యూజీడీ పనులకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వం కొండవాలులో యూజీడీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఇదిగో అదుగో అంటూ ఊరించి పనులు చేయకుండా వదిలేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొండవాలుకు యూజీడీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. దీన్‌దయాల్‌పురం నుంచి చినగదిలి, పెదగదిలి మీదుగా హనుమంతవాక వరకు బీఆర్‌టీఎస్ పక్కన సర్వీస్ రోడ్డులో రూ.1.15 కోట్లతో యూజీడీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తవగానే కొండవాలు నివాసాల నుంచి మరో రూ.10 కోట్లతో కనెక్టివిటీ లైన్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లోను మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఏఈలు అప్పాజీ, పవన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కనకరాజు, మువ్వల శ్రీను, హుస్సేన్, పి.బలరాజు, సూర్యారావు, మోహన్, బుజ్జి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు



జాబ్‌మేళాలో సంస్థల వివరాలు చూసుకుంటున్న యువత



ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు నిరీక్షిస్తున్న అభ్యర్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా అనుసంధాన్ సంస్థ నిర్వహించిన జాబ్ మేళాకు విశేషస్పందన లభించింది. శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన జాబ్‌మేళా సాయంత్రం వరకు కొనసాగింది. మొత్తం 29 సంస్థలు పాల్గొన్నాయి. ఐటీ సంస్థల్లో 430, ఇతర సంస్థల్లో రెండు వేలకు పైగా ఉద్యోగాలు భర్తీకి జాబ్‌మేళా నిర్వహించినట్లు అనుసంధాన్ సంస్థ వ్యవస్థాపకుడు సిఈఓ అడ్ల సుభాష్ తెలిపారు. విద్యార్థులకు ముందుగా ఒక నిర్దిష్టమైన బయోడేటా ఫారం అందించి, నిర్వాహకులు వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థుల విద్యార్హతలకు అనుగుణంగా నియామక ప్రక్రియక జరిపారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు నిర్వాహకులు చేశారు. విద్యార్థులు కూర్చోవడానికి ప్రత్యేకంగా టెంట్లు, తాగునీరు, కుర్చీలు వంటివి ఏర్పాటు చేశారు. ఏయూ భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రవిభాగంలోని సమావేశ మందిరాల్లో ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహించారు.

ఉపయుక్తంగా నిలిచింది



ఈసీఈలో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఈ జాబ్‌మేళాలో పలు సంస్థల నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా జాబ్ మేళా నిలిచింది.

– బి.దీపిక, విశాఖపట్నం

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

మద్దిలపాలెం : గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారంలో భాగంగా జీవీఎంసీ 16వ వార్డు రెల్లివీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శనివారం శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, జీవీఎంసీ ఏఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ సదస్సు నేడు

మద్దిలపాలెం: ఈ నెల 2న జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీలోని కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహిస్తాయని తెలిపారు.

డెంగ్యూపై అప్రమత్తత అవసరం



సింహాద్రిపురం కాలనీలో ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, తులసి

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య జెండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన సూచనలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ సింహాదిపురం కాలనీ పుర వీధుల్లో ఈ ర్యాలీ సాగింది. నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఎం.తులసీ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్, జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, జీవీఎంసీ మలేరియా ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్, మలేరియా సూపర్‌వైజర్లు మహన్‌దాదా, వైవీఎస్ రత్నం, నాగ సతీష్, సత్యానంద్, రామునాయుడు పాల్గొన్నారు.

యువతకు ఆధ్యాత్మిక విలువలు ఉండాలి



నాగఫణిశర్మకు జ్ఞాపిక బహూకరిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: ఆధ్యాత్మిక విలువలు, నైతికత యువత అలవరచుకోవాలని ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. శనివారం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోపం ఫలితాలు, నిర్వహణ విధానాలను వివరించారు. భారతీయ తాత్విక భావనలు ప్రజల మానసిక సమస్యలకు పరిష్కారాలు అందిస్తాయన్నారు. అనంతరం సింహ వారాహముఖి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పుస్తక రచయితలు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, డాక్టర్ డి.కె.ఐ.ఎస్.ప్రసాద్‌ను అభినందించారు. సదస్సులో కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ, సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.విజయ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

అందరికీ చేరువైన దూరవిద్య

వైభవంగా దూరవిద్య వ్యవస్థాపక దినోత్సవం



లంకపల్లి బుల్లయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న విశ్వేశ్వరరావు తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం 52వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముందుగా దూరవిద్య కేంద్రంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య విగ్రహానికి కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్యను చేరువ చేయడానికి దూరవిద్య ఒక సాధనంగా నిలిచిందన్నారు. 1972 సంవత్సరంలో ఎంతో దార్శినిక ఆలోచనలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఏయూ దూరవిద్య కేంద్రం ముందుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఎం.వి.ఎస్.చంద్రశేఖర్, ఆచార్య కె.సత్యనారాయణ, డాక్టర్ రాజు, డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.

గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి



దీన్‌దయాల్‌పురం కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు



అప్పుఘర్ తీరంలో సిద్ధమైన డ్రెసింగ్ రూమ్స్



రోడ్డు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు



హెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

ఆరిలోవ: సింహాచలం అప్పన్న గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బీఆర్‌టీఎస్ మార్గంలో ఆదివారం నడిచే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేశారు. అడవివరం నుంచి హనుమంతవాక వరకు 9 కిలోమీటర్ల మేర బీఆర్‌టీఎస్ మార్గంలో పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీ(విమ్స్ ఎదురు), హనుమంతవాక కూడళ్లలో శనివారం ఫ్లడ్ లైట్లు అమర్చారు. పాడైన విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు అన్ని లైన్లను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా ప్రసాదాల పంపిణీ కోసం పలు స్వచ్ఛంద సంస్థలు స్టాళ్లు ఏర్పాటు చేశాయి. హనుమంతవాక నుంచి దీన్‌దయాల్‌పురం వరకు రోడ్డు పక్కన ఉన్న పండ్ల దుకాణాలు, జ్యూస్, టిఫిన్ షాపులను తొలగించి, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెంలో జాతీయ రహదారిపై పక్కన ఉన్న సర్వీసు రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ శివాలయం ఎదురుగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రోడ్ల పక్కనే ఉన్న దుకాణాలు, తోపుడుబళ్లను తాత్కాలికంగా తొలగించారు. వెంకోజీపాలెం నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా సీతమ్మధార వరకూ రోడ్డును శుభ్రం చేశారు.

ముస్తాబైన అప్పుఘర్ తీరం

ఎంవీపీ కాలనీ: గిరిప్రదక్షిణకు అప్పుఘర్ తీరం ముస్తాబైంది. భక్తులు పెద్ద ఎత్తున సముద్ర స్నానాలు చేసేందుకు అప్పుఘర్ తీరానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో అప్పుఘర్ తీరంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. తీరంలో మొబైల్ టాయిలెట్స్‌తో పాటు లుంబిని పార్కును అనుకొని డ్రసింగ్ రూమ్స్ సిద్ధం చేశారు. ఆయా ప్రాంతంలోని విద్యుత్ దీపాలు పూర్తిస్థాయిలో వెలిగేలా మరమ్మతులు చేపట్టారు. అప్పుఘర్ కూడలి కేంద్రంగా ప్రత్యేక పోలీసు బలగాలతో పాటు 108 వాహనాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. బీచ్ రోడ్డులో రాకపోకలను సైతం రద్దు చేశారు. అప్పుఘర్, సమత కళాశాల కూడళ్లలో భక్తుల సౌకర్యార్థం తాగునీటి స్టాల్స్, ప్రత్యేక హెల్ప్ డెస్కులను జీవీఎంసీ ఏర్పాటు చేసింది.

నాలుగో వసంతంలోకి ఏఈఎంఎస్



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుకు జ్ఞాపిక అందిస్తున్న రవికిరణ్, సురేష్

మహారాణిపేట: రాష్ట్రంలో 108, 104, 102(తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్) నిర్వహిస్తున్న అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్(ఏఈఎంఎస్) సేవలు మూడేళ్లు పూర్తి చేసుకుని నాలుగో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఉద్యోగుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావును 108 జోన్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. అనంతరం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో వార్షికోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేయడంతో పాటు జిల్లాలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, జిల్లా ఫ్లీట్ జగ్గరాజు, డిస్ట్రిక్ మేనేజర్ త్రినాథ్, విశాఖ సిటీ కోఆర్డినేటర్ సురేష్ అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, 104 డిస్ట్రిక్ మేనేజర్ సంతోష్ అచ్యుత్ పాల్గొన్నారు.

'గోబడ్డీ'తో ఉద్యోగ అవకాశాలు

ఎంవీపీ కాలనీ: గోబడ్డీ యాప్ ద్వారా నిరుద్యోగులకు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పంచాడ నరసింహారావు, రాజు గౌడ్ తెలిపారు. యాప్ ద్వారా వివిధ రంగాల్లో కల్పిస్తున్న ఉపాధి అవకాశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్ గౌడ్ మాట్లాడుతూ గోబడ్డీ యాప్ అనేక హోమ్ నీడ్స్‌కు చెందిన అంశాల్లో సేవలు అందిస్తోందన్నారు. ప్లంబర్, కార్పెంటర్, పెయింటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, డ్రైవర్స్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. విశాఖతో పాటు అనకాపల్లి, కాకినాడ, విజయనగరం జిల్లాలకు సేవలను విస్తరించినట్లు తెలిపారు.

గురుకుల విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలి



శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

ఆరిలోవ: ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు శనివారం ఎడ్యుకేషన్ అండ్ ఎన్‌రిచ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రముఖ సైకాలజీ ప్రొఫెసర్ బి.రాజేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ బి.ప్రకాష్, హిందీ అధ్యాపకురాలు భ్రమరాంబికా దేవి, గురుకులం ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు చదువు, నైపుణ్యాలు, క్రమశిక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఉపాధ్యాయులు, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.